క్లుప్తంగా

నేటి నుంచి రాజారెడ్డి ఎన్నికల ప్రచారం

జలదంకి: మండలంలోని జమ్మలపాళెం నుంచి ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రచారం ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలపాళెంలో మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి వారసులు కేతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, సర్పంచ్ బుర్రి శ్రీవేణి ఆధ్వర్యంలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు హిందీదివాస్ ప్రాథమిక పరీక్ష


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సంగం: సంగం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో నిర్వాహకులు పెంచలహరి విద్యార్థులకు ఆదివారం హిందీ దివాస్ ప్రాథమిక స్థాయి పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 42 మంది విద్యార్థులు హాజరై పరీక్షను రాశారు. హిందీ దివాస్ పరీక్షతో విద్యార్థులకు అనేక రంగాల్లో ప్రయోజనం కలుగుతుందని పెంచలహరి తెలిపారు.

ఉచిత మెగా వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మర్రిపాడు: మండలంలోని పొంగూరులో లయన్స్ క్లబ్ సహకారంతో నల్లబోతుల రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆత్మకూరు ప్రముఖ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 250 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకోగా రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అపస్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అపస్ నాయకులు

సోమశిల: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అనంతసాగరం మండల శాఖ ఆధ్వర్యంలో అపస్ టాలెంట్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు సుమారు 65 పాఠశాలల నుంచి దాదాపు 800కు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో టాప్ 10 విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతుల ప్రదానం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు విడివిడిగా మొదటి ముగ్గురికి విశ్వసాయి విద్యాసంస్థల యాజమాన్యం ఇంటర్మీడియట్ కోర్సుకు ఫీజు రాయితీ కల్పిస్తూ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి అపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ బాలాజీ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె రాజగోపాలాచారి, పీ అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు అర్ వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. వెంకటేశ్వరరావు, ఎస్.వెంకయ్య, అత్మకూరు డివిజన్ కార్యదర్శి ఎం.పెంచలరెడ్డి, ఆత్మకూరు, ఏఎస్ పేట, మర్రిపాడు, సంగం, చేజర్ల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు, పీసీపీ రాఘవరెడ్డి, ఎం రమేష్, కె సూర్యనారాయణ, పీ కృష్ణ పాల్గొన్నారు. విద్యార్థులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి భోజన వసతి కల్పించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఏటూరు సుధాకర్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి


లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నేతలు

ఆత్మకూరు: కార్మిక, కర్షక కూలీల సమస్యలు పరిష్కరించేందుకు ఉద్యమించిన కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతకర్త డాక్టర్ లెనిన్ శత వర్ధంతిని ఆత్మకూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన శ్రామికుల కష్టాలను, వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి ఐక్యమత్యమే మార్గమని నిర్దేశించిన వ్యక్తని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు జి లక్ష్మీపతి, డేవిడ్‌రాజు, శివప్రసాద్, హజరత్తయ్య, ఎం నాగేంద్ర, వి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో వైద్యులు

కావలి: ప్రభుత్వం ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో అడుగులు వేస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి చెప్పారు. కావలి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో రూ.20 కోట్లతో నూతనంగా నిర్మించిన అదనపు భవనాల సముదాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సుమారు యాభై ఏళ్ల క్రితం కావలి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన కావలి ఏరియా వైద్యశాల ప్రస్తుతం పెరిగిన జనాభాకు అనుగుణంగా వైద్య సేవలు అందించడానికి సౌలభ్యంగా లేదన్నారు. కావలి నియోజకవర్గంలోని పేదలతో పాటు ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల ప్రజలు కూడా కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికే వైద్యం కోసం వస్తుంటారని చెప్పారు. ప్రధానంగా చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలు రద్దీ అనూహ్యంగా పెరగడంతో పాటు, అమరావతి–కడప రహదారికి కావలి కనెక్టివిటీ రావడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ప్రమాదం జరిగినప్పుడు కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రధాన కేంద్రంగా ఉంది. కావలి ఏరియా ఆస్పత్రి ప్రాధాన్యతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆధునిక భవనాలతో పాటు అత్యాధునిక వైద్య పరికరాలు, వైద్యుల నియామక ఆవశ్యకతను వివరించినట్లు చెప్పారు. దీంతో 'నాడు–నేడు' కింద రూ.20 కోట్లు మంజూరు చేయించి నూతన భవనాలు నిర్మించడంతో పాటు పరీక్షలు చేయడానికి అధునాతన పరికరాలు అమర్చడం, రోగులు, వైద్యులు, నర్సులకు అవసరమైన వసతులు ఉండే విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

150 పడకల వసతితో మరో ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు

కావలి ఏరియా ఆస్పత్రి ప్రాంగణం చిన్నది కావడంతో సువిశాలమైన భవనాలు, కార్పొరేట్ వైద్యం అందించే స్థాయిలో 150 పడకల వసతితో మరో వైద్యశాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. కావలి పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద 5 ఎకరాల భూమిలో విశాలమైన ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అక్కడే కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అవసరమైన వైద్యం అందించే డయాలసిస్ సెంటర్‌ను కూడా కొత్త భవనంలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ అనుమతులు కూడా రానున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు నిర్మించి వైద్య సేవలను ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పల్లె ప్రజల చెంతనే చేర్చామన్నారు. పట్టణంలో నాలుగు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఏడాదికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని అందిస్తూ పేదల పాలిట సంజీవనిగా మారిందని చెప్పారు. కుటుంబ ఆదాయ పరిమితిని రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచి, మరింత మందికి ఆరోగ్యశ్రీ సేవలను అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కావలి నియోజకవర్గంలో వైద్య సేవలు గణనీయంగా మెరుగుపడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో 'నాడు–నేడు' నిధులు మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు ఎమ్మెల్యే కు అన్ని విషయాల్లో నిర్దిష్టమైన సూచనలు చేసిన ఏరియా ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ కామంచి సుబ్బారావు, జిల్లా ఆస్పత్రుల కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ నాథ్, ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


ఏరియా వైద్యశాలలో అదనపు భవనాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కలికి బంధువులు వైఎస్సార్‌సీపీలో చేరిక


మాజీ మంత్రి యానాదిరెడ్డి నివాసంలో రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆయన బంధువులు

జలదంకి: మాజీ మంత్రి దివంగత కలికి యానాదిరెడ్డి బంధువులు ఆదివారం కావలిలోని యానాదిరెడ్డి నివాసంలో ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కలికి యానాదిరెడ్డి సొంత గ్రామం జలదంకి మండలం జమ్మలపాళెం, కావలిలోని ఆయన బంధువులు కేతిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, కేతిరెడ్డి ప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు వారి బంధువులందరూ కావలిలోని యానాదిరెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, వైఎస్సార్‌సీపీ నాయకులు రావి ప్రసాద్‌నాయుడు, గుర్రం జగ్గయ్యనాయుడు, ఇస్కా మదన్‌మోహన్ రెడ్డి, కోర్సిపాటి రామిరెడ్డి, వల్లంరెడ్డి నరసారెడ్డి, జమ్మలపాళెం సచివాలయ కన్వీనర్ సింగమనేని మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి అగ్ని ప్రవేశ మహోత్సవం


అగ్నిప్రవేశ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి అగ్ని ప్రవేశ మహోత్సవాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలవిరాట్‌కు విశేష సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేక వేదికపై చేర్చి మహిళలు వడిబాల బియ్యం, పసుపు, కుంకుమలు, ఎండు కొబ్బరి, తాంబూలాలతో 'సారె' సమర్పించారు. అనంతరం అగ్ని ప్రవేశ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. అమ్మ వారు ఏ పరిస్థితుల్లో తన జీవితాన్ని త్యాగం చేసి అగ్నిప్రవేశం చేసిన ఘట్టాన్ని అర్చకులు భక్తులకు వివరించారు. ఉభయకర్తలుగా పోకూరు జ్ఞానయ్య దంపతులు వ్యవహరించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు దోర్నాదుల సురేష్‌బాబు, హజరత్తయ్య, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

• ఎంపీపీ మెట్టుకూరు శిరీష


మాట్లాడుతున్న ఎంపీపీ మెట్టుకూరు శిరీష

కలిగిరి: వేసవి సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ మెట్టుకూరు శిరీష తెలిపారు. కలిగిరిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పరం సహకారంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదని టీడీపీకి చెందిన రావులకొల్లు సర్పంచ్ వెంగపనాయుడు ఆరోపించడం జెడ్పీటీసీతో పాటు మరికొందరు ఎంపీటీసీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు, మిల్క్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చారన్నారు. అవినీతికి, లంచాలకు తావులేకుండా కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలకు ఏర్పాటు జరుగుతున్నాయన్నారు. టీడీపీ నాయకులకు ఇలాంటి అభివృద్ధి కనబడదని ఎద్దేవా చేశారు. కళ్ల ముందు అభివృద్ధి కనబడుతున్నా.. నిస్సిగ్గుగా ఇలాంటి విమర్శలు చేస్తుంటే ప్రజలే అసహ్యించుకుంటున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే మీ పార్టీని బంగాళాఖాతంలో కలిపేస్తారన్నారు. అనంతరం శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఓ బ్రహ్మాచారి, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, వైస్ ఎంపీపీ పొన్నం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి



ఉదయగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న దేశ వ్యాప్తంగా జరిగే బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు కె.వెంకటయ్య పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రైతు సంఘాల నాయకులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు తెచ్చిన నల్ల చట్టాలను రద్దు చేస్తామన్న కేంద్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదన్నారు. కేంద్రం లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, ఫరిద్దీన్‌బాషా, రమణయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల15 నుంచి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు


ప్రతిష్ట మహోత్సవాలకు ముస్తాబైన నూతన ఆలయం

వరికుంటపాడు: వరికుంటపాడులో నూతనంగా నిర్మించిన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 15న గోపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, రక్షాబంధనం, వాస్తు పూజ, అంకురారోపణ, ధాన్యాధివాసం, 16న యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్టాపన, 17న మూలమంత్రహవనములు తదితర ప్రత్యేక పూజలు, 18న మహాశాంతి స్థాపనములు, విమాన కలశ స్థాపన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, 19న మహాకుంభ సంప్రోక్షణ, విగ్రహ ప్రాణప్రతిష్ట, విశరూపదర్శనం, బలి నివేదనం, శ్రీనివాస శాంతి కల్యాణం, గ్రామోత్సవం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఇప్పటికే ఆలయాన్ని మహోత్సవాలకు ముస్తాబు చేశారు.

ధ్యానంతోనే ఆరోగ్యం



ఆత్మకూరు/ చేజర్ల: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మనస్సు ప్రశాంతంగా ఉంటుందని ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన ప్రముఖ పిరమిడ్ ధ్యాన మాస్టర్ తిరుపతిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని షిరిడీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం, చేజర్ల మండలం పులనీళ్లపల్లిలోని వెంకయ్యస్వామి గుడిలో ప్రత్యేక ధ్యాన తరగతులు నిర్వహించారు. మాస్టర్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ చిన్న వయసు నుంచే ధ్యానం వల్లన కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం వారి పిల్లలకు ధ్యానం అలవాటు చేయాలన్నారు. ఒత్తిడి జీవితంలో అనేక రోగాలు సంక్రమిస్తాయని, వాటిని అదుపులో ఉంచాలంటే ధ్యానం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పిరమిడ్ మాస్టర్ మూరంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, చేజర్ల కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమం


అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఉదయగిరి: జామాఅతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు మత్తు పదార్థాల వినియోగ వ్యతిరేక ఉద్యమ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జామాఅతే ఇస్లామీ హింద్ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ తెలిపారు. ఆయన ఆదివారం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజాన్ని సర్వనాశనం చేసే మత్తు పదార్థాల మహమ్మారి నుంచి యువతను కాపాడి ఉత్తమ సమాజాన్ని నిర్మించడమే తమ సంస్థ ధ్యేయమన్నారు. యువత మత్తు పదార్థాలు, పానీయలకు అలవాటు పడి తమ జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుంటున్నారన్నారు. దేశానికి యువత ఎంతో కీలకమని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇప్పటికే తమ సంస్థ ద్వారా అవగాహనా కార్యక్రమాలు, కరపత్రాలతో, వాల్ పోస్టర్లతో అవగాహన కల్పించి యువతను చైతన్య పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, సభ్యులు నసురుల్లా, మసూద్, సిద్ధిఖ్, మునాఫ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.


జిర్రావారిపాళెంలో యువతతో మాట్లాడుతున్న సమన్వయకర్త మేకపాటి

మేమంతా జగనన్న వెంటే

కలిగిరి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు తమ వంతుగా ప్రచారం చేస్తామని, తామంతా ఆయన వెంటే ఉన్నామని తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోనున్న యువ ఓటర్లు స్పష్టం చేశారు. ఉదయగిరి నియోజకవర్గం నుంచి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యతను తమ భుజస్కంధాలపై వేసుకుంటామని చెప్పారు. కలిగిరి పంచాయతీ జిర్రావారిపాళెంకు వచ్చిన ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని కొత్తగా ఓటు హక్కు పొందిన యువకులు ఆదివారం కలిశారు. సమన్వయకర్త మేకపాటి వారితో ఆప్యాయంగా మాట్లాడి యువతకు అన్ని విధాలుగా పూర్తిగా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక గ్రామస్తులు, మహిళలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు బొర్రా మస్తాన్‌రెడ్డి, ములకా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద వృద్ధులకు సరుకుల పంపిణీ


వృద్ధులకు సరుకులు అందజేస్తున్న దృశ్యం

కావలి: పట్టణంలోని డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో 60 మంది నిరుపేద వృద్ధులకు రూ.60 వేలు విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. సబ్ జైలు సూపరింటెండెంట్ సి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యా ప్రదాత డీఆర్ పేరు మీద వృద్ధులను ఆదుకుంటున్న ఆయన కుమారులు వినయ్‌కుమార్‌రెడ్డి, విద్యాధర్‌కుమార్‌రెడ్డిను అభినందించారు. మంచి విద్యతో పాటు, సమాజానికి సేవ చేయడం గొప్ప విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను కూడా భాగస్వాములను చేస్తూ వారిలో కూడా సామాజిక సహ, సేవాభావం నింపడం బహు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, సేవా సమితి డైరెక్టర్ తాతిరెడ్డి, సభ్యులు సతీష్‌సింగ్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజలో కాలనీ వాసులు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ఎస్సీ కాలనీలో నూతన ఆలయ నిర్మాణానికి కాలనీ వాసులు భక్తి శ్రద్ధలతో ఆదివారం భూమిపూజ నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహ వాచనం, నవగ్రహ మండపారాధన, కలశపూజ, గణపతి, నవగ్రహ, వాస్తుహోమాలు, శంకు ప్రతిష్టా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్.తిరుపతి, రమణయ్య, శ్రీనివాసులు మాజీ సర్పంచ్ రాపల్లి భారతి, ఎస్.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గండారపమ్మ తల్లికి పొంగళ్లు


గండారపమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

చేజర్ల: కోరిన కోర్కెలు తీర్చే గ్రామదేవత గండారపమ్మ తల్లికి పొంగళ్లు ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగాయి. చేజర్లలో కొలువైన గ్రామదేవత గండారపమ్మకు ప్రతి ఏటా ఫిబ్రవరిలో మూడు రోజుల పాటు తిరునాళ్లు నిర్వహిస్తారు. మొదట మేళతాళాలు, వాయిద్యాల మధ్య మహిళలు పొంగళ్ల బుట్టలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా బయలు దేరారు. దేవాలయ ప్రాంగణం చేరి అక్కడ గ్రామ పొంగళ్లు పొంగించారు. గండారపమ్మకు పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యునాని వైద్యానికి పెరుగుతున్న ఆదరణ

• ఆర్‌డీటీ డాక్టర్ పద్మజతి
• ఘనంగా జాతీయ యునాని దినోత్సవం


మాట్లాడుతున్న ఆర్‌డీటీ డాక్టర్ పద్మజతి

ఆత్మకూరు: ఇటీవల కాలంలో యునాని వైద్యానికి ఆదరణ పెరుగుతుందని ప్రజలకు అవగాహన కలిస్తుండడంతో ఈ వైద్యం కోసం వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతుందని ఆయుష్మాన్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జీ పద్మజతి అన్నారు. జాతీయ యునాని దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలోని యునాని వైద్యశాలలో ఆదివారం డాక్టర్ అబ్దుర్ రజాక్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మజతి మాట్లాడుతూ ఆయుష్మాన్ ద్వారా ఐదు రకాల వైద్య సేవలు అందుతాయని, అందులో యునాని ఒకటని తెలిపారు. మూడు జిల్లాల పరిధిలో యునాని వైద్యానికి నెల్లూరు జిల్లాలో ఆదరణ ఎక్కువ ఉందని, యునాని వైద్యశాలలు సైతం ఈ జిల్లాలోనే ఎక్కువని వివరించారు. తొలుత యునాని వైద్య పితామహుడు అకీమ్ అజ్మల్ ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కోసి యునాని దినోత్సవాన్ని ప్రారంభించారు. యునాని వైద్యులు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ పద్మజతిని యునాని వైద్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం, కందుకూరు, గుడ్లూరు యునాని వైద్యులు త్రినేత్రి, విమల, ప్రసన్న, అర్బన్ వైద్యశాలకు చెందిన ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక


కొత్తసత్రంలో పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


కావలి 40వ వార్డులో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే

కావలి: మండలంలోని తుమ్మలపెంట పంచాయతీ కొత్తసత్రంకు చెందిన టీడీపీ నేతలు టైలర్ బాబు, హరిబాబు, శ్రీను తదితరుల ఆధ్వర్యంలో సుమారు 50 మంది మత్స్యకారులు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తానని పార్టీలో చేరిన వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నబోయిన ప్రసాద్‌యాదవ్, నాయకుడు దామిశెట్టి శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు

పట్టణంలో మరో 100 మంది

కావలి పట్టణంలోని 40వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్తలు 100 మందికి పైగా ఆదివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రాన్ను ఎన్నికల్లో ప్రతాప్‌కుమార్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు.